హైదరాబాద్ మెట్రో ప్రాజెక్టులో జైపాల్ రెడ్డి పాత్ర కీలకం

మెట్రో ఎం.డీ ఎన్వీఎస్ రెడ్డి

సిటీబ్యూరో, జనవరి 16 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ మహానగరానికి మెట్రో రైలు ప్రాజెక్టును మంజూరు చేయడంలో దివంగత మాజీ కేంద్ర మంత్రి, ఎస్.జైపాల్ రెడ్డి ఎంతో కృషి చేశారని మెట్రో ఎం.డీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. మంగళవారం జైపాల్‌రెడ్డి జయంతిని పురస్కరించుకొని నెక్లెస్‌రోడ్డులోని స్ఫూర్తి స్థల్‌లో ఉన్న ఆయన సమాధి వద్ద పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎన్వీఎస్ రెడ్డి మాట్లాడుతూ.. హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టును అప్పటి కేంద్ర ప్రభుత్వం మంజూరు చేయడంలో కీలక పాత్ర పోషించారని చెప్పారు. ఆ సమయంలో కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రిగా ఉన్న జైపాల్ రెడ్డి ఈ ప్రాజెక్టుకు అవసరమైన అనుమతులతో పాటు వయబిలిటీ గ్యాప్ ఫండింగ్‌కు ఆమోదింపజేశారు. అలాగే మెట్రో రైలు ప్రాజెక్టులో స్టాండర్డ్ గేజ్‌ను అనుసరించాలనే విధానానికి భారతీయ రైల్వే వ్యతిరేకించడంతో దేశంలోని ఢిల్లీ, హైదరాబాద్, ముంబై, బెంగళూరు మెట్రో రైలు ప్రాజెక్టులు గేజ్ సమస్యపై నిలిచిపోయాయి. దానిపై జైపాల్ రెడ్డి తీసుకున్న చొరవతో హైదరాబాద్‌తో పాటు దేశంలోని ఇతర మెట్రో రైలు ప్రాజెక్టులు విజయవంతంగా చేపట్టడానికి కారణమైందని ఎండీ ఎన్వీఎస్ రెడ్డి పేర్కొన్నారు.

నగరంలో తగ్గుతున్న చలి..

జూబ్లీహిల్స్, జనవరి 16 : గ్రేటర్‌లో చలి క్రమంగా తగ్గుతున్నది. నగరంలో మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు గరిష్ఠ ఉష్ణోగ్రతలు 31.2 డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రతలు 19.5 డిగ్రీల సెల్సియస్‌గా.. గాలిలో తేమ 46 శాతంగా నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. రానున్న రోజుల్లో చలి తీవ్రత మరింత తగ్గనున్నట్లు అధికారులు వెల్లడించారు.

బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా చంద్రశేఖర్

హైదరాబాద్, జనవరి 16 (నమస్తే తెలంగాణ): బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి (ఆర్గనైజేషన్)గా చంద్రశేఖర్‌ను ఆ పార్టీ అధిష్ఠానం నియమించింది. ఈ మేరకు ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు

అలా వచ్చి.. ఇలా వెళ్లే వారికి జీతాలు.!

- ఎన్నికల ముందు డిప్యుటేషన్‌పై బల్దియాకు 12 మంది ఆఫీసర్లు
- ఆ తర్వాత కనీస బాధ్యతలు అప్పగించకుండానే నెలవారీ వేతనాలు
- పని లేకుండానే జీతాలు చెల్లిస్తున్న వైనం
- జీహెచ్ఎంసీలో చర్చనీయాంశమైన డిప్యుటేషన్లు
- బల్దియాపై ఆర్థిక భారం పడుతున్నా పట్టని కమిషనర్

సిటీబ్యూరో, జనవరి 16 (నమస్తే తెలంగాణ): జీహెచ్ఎంసీలో దుబారాకు అడ్డూ అదుపులేకుండా పోతోంది. ఒక పక్క సంస్థ ఆర్థికంగా బక్కచిక్కిపోయి ఉద్యోగులకు నెలవారీ వేతనాలు సరిగా అందడం లేదు. పైగా డబ్బులు లేక అభివృద్ధి కుంటుపడింది. కాంట్రాక్టర్లు సైతం బకాయి బిల్లులు చెల్లిస్తేనే పనులు చేపడతామంటూ రోజుకో జోన్‌లో ఆందోళనలు చేస్తున్న పరిస్థితి. సంస్థ ఆర్థిక పరిస్థితి రోజురోజుకు చేయిదాటిపోతుంటే..లోపాలను సరిదిద్దుకొని పొదుపు మంత్రాలతో సంస్థను గట్టెక్కించాల్సిన కమిషనర్ డిప్యుటేషన్లను నియంత్రించకపోవడం పట్ల తీవ్ర విమర్శలకు తావిస్తోంది. సంస్థ ప్రధాన ఆదాయవనరుగా ఉన్న ఆస్తిపన్ను వసూళ్లలో అనుకున్న లక్ష్యాలను ఇప్పటికే చేరలేకపోయారు. దీనికి తోడు డిప్యుటేషన్ల పరంపర కొనసాగుతున్నది. పైగా బల్దియాకు వచ్చిన వారికి బాధ్యతలు అప్పజెప్పకపోవడం ..హైదరాబాద్‌లో ఉండాలనుకునే వివిధ విభాగాలకు చెందిన అధికారులంతా పైరవీలతో డిప్యుటేషన్‌పై వచ్చి తిష్ట వేస్తుండటం పరిపాటిగా మారుతోంది. ఈ నేపథ్యంలోనే ఇటీవల అసెంబ్లీ ఎన్నికలకు రెవెన్యూ శాఖ నుంచి ఏడుగురు ఆర్డీఓ (డిప్యూటీ కలెక్టర్లు), ఐదుగురు ఇతర శాఖల నుంచి నియమించుకున్న బల్దియా ..ఎన్నికలు పూర్తయిన వారిని మాత్రం నేటికీ కొనసాగిస్తున్నారు. కనీసం బాధ్యతలు అప్పగించకుండా వారికి మాత్రం నెలవారీ వేతనాలు చెల్లిస్తున్నారు. పని చేయకుండా జీతాలు చెల్లించడమేమిటని ఉద్యోగుల్లో తీవ్ర చర్చ జరుగుతోంది. అప్పుల ఊబిలో కూరుకుపోయిన బల్దియా..పొదుపు ఆలోచన చేయకుండా డిప్యుటేషన్‌పై వచ్చే వారికి ఎర్ర తివాచీ పరిచి స్వాగతం పలుకుతుండటం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

భారమని తెలిసినా ఎందుకీ మౌనం?

జీహెచ్ఎంసీలో ప్రస్తుతం ప్రతి నెలా వేతనాలు, పెన్షన్లకు రూ. 120 నుంచి 130కోట్లు చెల్లించాల్సి వస్తోంది. అయితే సంస్థలో అవసరాల మేరకు మాత్రమే డిప్యుటేషన్లను ప్రోత్సహించాలి. కానీ అలా జరగడం లేదు..హైదరాబాద్‌లో ఉండాలనుకునే ఉద్యోగులంతా పైరవీలతో కొందరు..కమిషనర్‌ను సంప్రదించి మరికొందరు వస్తున్నారు. ఈ నేపథ్యంలోనే కమిషనర్ రొనాల్డ్‌రాస్ అసెంబ్లీ ఎన్నికల సమయంలో 12 మందిని డిప్యుటేషన్‌పై తీసుకువచ్చారు. గతంలో ఈ స్థాయిలో ఎన్నికల కోసం అధికారులను తీసుకొచ్చిన దాఖలాలు లేవు. ఎన్నికల్లో రిటర్నింగ్ అధికారులు, ఆయా బాధ్యతలు నిర్వర్తించిన వీరు ఎన్నికల అనంతరం వీరికి బల్దియాలో బాధ్యతలు అప్పగించలేదు. ఇప్పటికే ఉన్న డిప్యుటేషన్ అధికారులకు తోడు వీరికి కల్పించే అధికారులకు సదుపాయాల కల్పన మరింత భారమవుతోంది. వేతనాలతో పాటు వాహనాలకు అయ్యే ఖర్చు బల్దియా భరించాల్సి వస్తోంది. అంతేకాకుండా కొందరు అటెండర్లనూ వెంట తెచ్చుకోవడం గమనార్హం. మొత్తంగా అవసరం లేని అధికారులను ఇక్కడి నుంచి పంపిస్తే సంస్థకు భారీగా ఆదాయం ఆదా అవుతుందని చెబుతున్నారు.

డిప్యుటేషన్లకు ఎర్ర తివాచీ..

జీహెచ్ఎంసీలో రిటైర్డ్ అయిన వారు, డిప్యుటేషన్ వచ్చిన వాళ్లు ఏళ్ల తరబడి కొనసాగుతున్నారు. ఎన్నికల ముందు వచ్చిన కొందరు మళ్లీ పైరవీలో రావడం మొదలు పెట్టారు. ఈ క్రమంలోనే విద్యుత్, అటవీ, వైద్యారోగ్య శాఖల నుంచి డిప్యుటేషన్లపై వచ్చిన చాలా మంది నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్నారు. దాదాపు పదేండ్ల పాటు డిప్యుటేషన్‌పై కొనసాగుతున్న అధికారి ఉన్నారు. రిటైర్డ్ అయి నేటికీ కొనసాగుతున్న ముగ్గురు అధికారులు సైతం ఉన్నారు. రిటైర్డ్ అయిన తర్వాత కొనసాగుతున్న అధికారుల వివరాలను సేకరించే పనిలో ప్రభుత్వం ఉండటంతో వీరి పట్ల ఏ నిర్ణయం తీసుకుంటారో అన్న చర్చ ఉద్యోగుల్లో నడుస్తోంది. రిటైర్డ్ అయిన వారంతా సంస్థను వీడకపోవడంతో కిందిస్థాయిలో ఉన్న వారు అవకాశాలు కోల్పోతున్నారని ఆవేదన చెందుతున్నారు.

దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుంది

వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

కాచిగూడ, జనవరి 16: ప్రపంచ దేశాలు ప్రధాని నరేంద్రమోదీని విశ్వసిస్తున్నాయని, ఈ నెల 22న రామమందిరాన్ని ప్రారంభించి జాతికి అంకితం చేస్తారని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా మంగళవారం నింబోలిఅడ్డా అమ్మవారి దేవాలయం ఆవరణలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ముద్ర యోజన, ఉజ్వల గ్యాస్, విశ్వకర్మ యోజన లాంటి అనేక సంక్షేమ పథకాల స్టాళ్లను ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి హాజరై స్టాళ్లను సందర్శించి, ముద్రయోజనతో బ్యాంకు ద్వారా లబ్ధిపొందిన లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. దేశం మరింతగా అభివృద్ధి చెందాలంటే స్థిరమైన ప్రభుత్వం అవసరమని, అది కేవలం మోదీతోనే సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ఉమా రమేశ్‌యాదవ్, అమృత, మాజీ మంత్రి కృష్ణయాదవ్, డాక్టర్ గౌతంరావు, కన్నె రమేశ్‌యాదవ్, డాక్టర్ మనోజ్‌రెడ్డి, సంధ్య, నందకిశోర్ యాదవ్, వినోద్‌యాదవ్, సుభాష్ పటేల్, కేసరి నర్సింగ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

జైపాల్‌రెడ్డికి నివాళి



దివంగత కేంద్ర మాజీ మంత్రి, ఉత్తమ పార్లమెంటేరియన్ అవార్డు గ్రహీత డాక్టర్ సూదిని జైపాల్‌రెడ్డి జయంతి సందర్భంగా నెక్లెస్ రోడ్డులోని 'స్ఫూర్తి స్థల్'లో ఉన్న ఆయన సమాధి వద్ద మంత్రి జూపల్లి కృష్ణారావు నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... జైపాల్‌రెడ్డి దేశ రాజకీయాల్లో తనకంటూ ఓ ప్రత్యేక ముద్ర వేసుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ మల్లు రవి, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. *- బేగంపేట్, జనవరి 16*

అజ్మీర్ దర్గాకు ప్రత్యేక రైలు ప్రారంభం

ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఆగ్రా సమీపంలో ఉన్న అజ్మీర్‌దర్గా ఉర్సును పురస్కరించుకొని నగరం నుంచి వెళ్లిన భక్తులకు నాంపల్లి రైల్వే స్టేషన్ నుంచి ఏర్పాటు చేసిన ప్రత్యేక రైలును నియోజకవర్గ ఎమ్మెల్యే మహ్మద్ మాజీద్ హుస్సేన్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ అధ్యక్షుడు ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఆదేశాలతో రైల్వే ఉన్నతాధికారులతో మాట్లాడి ప్రత్యేక రైలును ఏర్పాటు చేశామని తెలిపారు. *- మెహిదీపట్నం జనవరి 16*

హెచ్ఎండీఏ చీఫ్ ఇంజినీర్ బీఎల్ ఎన్ రెడ్డి రాజీనామా

ఇన్‌చార్జి సీఈగా పరంజ్యోతి

సిటీబ్యూరో, జనవరి 16 (నమస్తే తెలంగాణ): హెచ్ఎండీఏ చీఫ్ ఇంజినీర్, ఔటర్ రింగ్ రోడ్డు ఇన్‌చార్జి ప్రాజెక్టు డైరెక్టర్‌గా కొనసాగిన బీఎల్ఎన్ రెడ్డి మంగళవారం తన పదవికి రాజీనామా చేశారు. మానసిక ఒత్తిడి, అనారోగ్య కారణాల దృష్ట్యా బాధ్యతల్లో కొనసాగలేనని పేర్కొంటూ సంస్థ కమిషనర్ దానకిశోర్‌కు రాజీనామాను సమర్పించారు. ఫ్లై ఓవర్లు, మూసీ నది సుందరీకరణ, రహదారుల అభివృద్ధి, హుస్సేన్‌సాగర్ అభివృద్ధిలో బీఎల్ఎన్ రెడ్డి తనదైన ముద్ర వేసుకున్నారు. బీఎల్ఎన్ రెడ్డి రాజీనామాతో ఖాళీగా ఏర్పడిన హెచ్ఎండీఏ చీఫ్ ఇంజినీర్ స్థానాన్ని ఎస్ఈ పరంజ్యోతికి ఇన్‌చార్జి సీఈగా బాధ్యతలు అప్పగించారు. పరంజ్యోతికి బాధ్యతలు అప్పగించడం పట్ల సంస్థ ఇంజినీర్లలో విస్తృతంగా చర్చ జరుగుతున్నది. ముగ్గురు సీనియర్ ఎస్ఈలు రవీందర్, మాజీద్ షరీఫ్, యూసుఫ్‌హుస్సేన్ ఉన్నప్పటికీ వీరి సీనియార్టీని పరిగణనలోకి తీసుకోకుండా కమిషనర్ ఏకపక్షంగా నిర్ణయం తీసుకున్నారని, పరంజ్యోతి జూనియర్ అయినప్పటికీ కీలక సీఈగా బాధ్యతలు అప్పజెప్పడం ఏమిటని ఇంజినీర్లలో హాట్‌హాట్‌గా చర్చ జరుగుతున్నది. దీనిపై సీనియర్ ఎస్ఈలు అలక వహిస్తారా? కమిషనర్‌ను కలిసి వాస్తవాలు తెలియజేస్తారా? ముందుముందు పరిస్థితులు ఎలా ఉంటాయన్నది ఉద్యోగులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న పరిస్థితి నెలకొంది. అలాగే ప్రస్తుతం హెచ్ఎండీఏ కార్యదర్శిగా డిప్యుటేషన్‌పై విధులు నిర్వహిస్తున్న పి.చంద్రయ్యను కొనసాగించడం లేదని హెచ్ఎండీఏ అధికారులు తెలిపారు. ఈనెల 21 వరకు ఆయన డిప్యుటేషన్ ఉండగా, దాన్ని పొడిగించాలని కోరినా కమిషనర్ తిరస్కరించడంతో చంద్రయ్య సైతం హెచ్ఎండీఏ కార్యదర్శి బాధ్యతల నుంచి తప్పుకునే అవకాశం ఉంది. వీరితో పాటు డిప్యుటేషన్‌పై ఉన్న మరికొందరిపై వేటు వేసే అవకాశాలు ఉన్నాయని హెచ్ఎండీఏలో గుసగుసలు వినిపిస్తున్నాయి.

సన్యాసిగా మారిన 19 ఏండ్ల యోగితా సురానా

కాచిగూడ, జనవరి 16 : ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు ప్రాంతానికి చెందిన పద్మారాజ్ సురానా, సపానా సురానా దంపతుల కుమార్తె యోగితా సురానా(19)మంగళవారం కాచిగూడ జూనియర్ కళాశాల ప్రాంగణంలో వందలాది మంది జైన్‌ల మధ్య సన్యాసిగా మారింది. ఈ సందర్భంగా బర్కత్‌పుర యాదాద్రి భవన్ నుంచి వందలాది మంది జైన్‌లు ర్యాలీగా.. కాచిగూడలోని జైన్‌మందిర్, బర్కత్‌పుర ఎక్స్‌రోడ్, రాఘవేంద్రస్వామి టెంపుల్, బాగ్ లింగంపల్లి, టూరిస్ట్ హోటల్, రైల్వేస్టేషన్ మీదుగా కాచిగూడ జూనియర్ కళాశాల వద్దకు చేరుకున్నారు. అనంతరం జైన్‌ల సమక్షంలో సన్యాసిగా మారింది. వర్ధమాన్ స్థానక్‌వాసి జైన్, ప్రవక్ సంఘ్, శ్రీజైన్ రథన్ తదితరులున్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎండీ.యూసుఫ్ తదితరులు

హిమాయత్‌నగర్, జనవరి 16: రాష్ట్రంలోని గ్రామ పంచాయతీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ.యూసుఫ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ సమావేశం హిమాయత్‌నగర్‌లోని ఎస్ఎన్‌రెడ్డి భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా 12,769 గ్రామ పంచాయతీల్లో 50 వేల మంది కార్మికులు పనిచేస్తున్నారని, వారి సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో జరిగే ప్రభుత్వ పనుల్లో పంచాయతీ కార్మికుల పాత్ర కీలకమని, ఆరోగ్యాన్ని సైతం లెక్కచేయకుండా చాలీచాలని వేతనాలు తీసుకుంటూ సేవలు అందిస్తున్నారని తెలిపారు. అనంతరం యూనియన్ ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో యూనియన్ కార్యనిర్వహక అధ్యక్షుడు కె.జయచంద్ర, ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ రాజం, నాయకులు పి.మల్లయ్య, అంజయ్య, రంగారెడ్డి, యాదవ్ పాల్గొన్నారు.

దివ్యాంగులకు అండగా పీఅండ్‌జీ

సిటీబ్యూరో, జనవరి 16 (నమస్తే తెలంగాణ): దివ్యాంగులకు అండగా హైదరాబాద్ పీఅండ్‌జీ ఇండియా సంస్థ మారథాన్ నిర్వహించింది. వారి సంరక్షణ కోసం కృషి చేస్తున్న శంకర్ ఫౌండేషన్‌కు రూ.3లక్షల విరాళాన్ని సంస్థ సభ్యులు అందించినట్టు నిర్వాహకులు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మారథాన్‌లో 3 వందల మంది ఉద్యోగులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ పీఅండ్‌జీ ఇండియా ప్లాంట్ హెడ్ సుమిత్ రాణా తదితరులు పాల్గొన్నారు.

నుమాయిష్‌కు 16 రోజుల్లో.. 6 లక్షల మంది ..

అబిడ్స్, జనవరి16: మంగళవారం సెలవు దినం కావడంతో ఎగ్జిబిషన్ సందర్శకులతో కిక్కిరిసింది. నుమాయిష్‌ను ఒక్కరోజే 75 వేలమంది సందర్శకులు సందర్శించారు. సందర్శకులు పెద్ద ఎత్తున తరలిరావడంతో స్టాళ్లు, అమ్యూజ్‌మెంట్ పార్కులు కిక్కిరిసిపోయాయి. గత 16 రోజుల్లో ఎగ్జిబిషన్‌ను 6 లక్షల మంది సందర్శించారని సొసైటీ ఉపాధ్యక్షుడు వనం సత్తేందర్, కార్యదర్శి హనుమంతరావు తెలిపారు.

ఉప్పల్ శిల్పారామంలో చిన్నారుల నృత్యాలు

ఆకట్టుకున్న చిన్నారుల నృత్యాలు

రామంతాపూర్, జనవరి 16 : ఉప్పల్ మినీ శిల్పారామంలో గంగిరెద్దుల ఆటలు, బుడబుక్కల జంగమ దేవర, హరిదాసుల విన్యాసాలు ఆహూతులను ఎంతగానో అలరించాయి. పేరిణీ శ్రీనివాసరావు శిష్యబృందం చే ఆంధ్రనాట్య ప్రదర్శన ఆద్యంతం అందరిని ఆకట్టుకుంది. వినాయక కౌతం, గంగాధర, అగణిక, నమోనాథ, విన్నుమించి, దేవీస్తుతి, నవగ్రహాలు, ప్రవేశ ధరువు మొదలైన అంశాలను సహస్ర, విరీశ, ప్రశాంతి, మైత్రి, తన్మయి, సాన్విక, సచిత, శ్రీహిత, నైనిక, నేత్ర, కీర్తన,భవ్య, భావన, ప్రియాంక, ప్రదర్శించి ఆహూతులను మెప్పించారు.

ఆర్టీసీకి కలిసొచ్చిన పండుగ ప్రయాణం

- గ్రేటర్‌లోనూ భారీగా పెరిగిన రాకపోకలు
- అన్ని జిల్లాలకు గ్రేటర్ నుంచి స్పెషల్ బస్సులు

సిటీబ్యూరో, జనవరి 16(నమస్తే తెలంగాణ) : సంక్రాంతి పండుగ, మహిళలకు ఉచిత ప్రయాణంతో గ్రేటర్ ఆర్టీసీకి కలిసొచ్చింది. సొంతూళ్లకు వెళ్లేందుకు మెజార్టీ జనాలు ప్రధాన బస్టాండ్లకు చేరుకునేందుకు సిటీ బస్సులను వినియోగించడం, సిటీలో ఉన్న ఆర్టీసీ బస్సులను అన్ని జిల్లాలకు ప్రత్యేకంగా ఏర్పాటు చేయడంతో ఆర్టీసీలో ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగింది. గతంలో కంటే ప్రయాణికుల సంఖ్య 20 నుంచి 30 శాతం ఎక్కువగా ఉందని ఆర్టీసీ వర్గాలు చెబుతున్నాయి. గ్రేటర్‌లో మొత్తం 2800 బస్సులలో రాకపోకలు సాగుతున్నాయి. పండుగ నేపథ్యంలో సొంతూళ్లకు వెళ్లే వారి కోసం గ్రేటర్ ప్రయాణికుల రద్దీని బట్టి ప్రత్యేక సర్వీసులను గ్రేటర్ ఆర్టీసీ వర్గాలు ఏర్పాటు చేశాయి. ఈ క్రమంలో 13న 700 ప్రత్యేక బస్సులు, 14న 1100 సర్వీసులు, 15న 500 సర్వీసులను ఏర్పాటు చేయడంతో ఊహించిన దాని కంటే ఎక్కువ మంది గమ్యస్థానాలకు విజయవంతంగా తీసుకెళ్లారు. 18 సంక్రాంతి సెలవులు ముగియనుండటంతో సొంతూళ్ల నుంచి వచ్చేవారి కోసం కూడా ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉన్నాయని ఆర్టీసీ వర్గాలు పేర్కొన్నాయి. కాగా రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 12న ఒక్క రోజే 53లక్షల మందిని సొంతూళ్లకు తీసుకెళ్లగా, గతంలో ఈ తరహాలో ప్రయాణికుల రద్దీ లేదని అధికారులు పేర్కొన్నారు.

మొదలైన తిరుగు ప్రయాణాలు..

సంక్రాంతి పండుగ ముగియడంతో సొంతూళ్ల నుంచి తిరుగు ప్రయాణాలు మొదలయ్యాయి. రద్దీ నేపథ్యంలో కొంత మంది హైదరాబాద్ రావడానికి ఏర్పాట్లు చేసుకోవడంతో మంగళవారం రాత్రి నుంచే ముందస్తు బుకింగ్‌లతోపాటు, బస్టాండ్ల వద్ద రద్దీ మొదలైందని.. పెరుగుతున్న ప్రయాణికులకు అనుగుణంగా సర్వీసులు అన్ని జిల్లాల నుంచి అందుబాటులో ఉన్నట్టు ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఈ నెల 17 నాటికి పండుగ రెవెన్యూపై సమగ్రమైన లెక్కలు పూర్తవుతాయని, గతేడాది కంటే ప్రయాణికుల సంఖ్య 20 నుంచి 30 శాతం పెరిగేందుకు అవకాశం ఉందని ఆర్టీసీ అధికారులు అంచనా వేస్తున్నారు.

ఆకట్టుకున్న 'ద రామేశ్వరం' కేఫ్

సిటీబ్యూరో, జనవరి 16 (నమస్తే తెలంగాణ): బెంగళూరు వాసులను ఆకట్టుకున్న 'ద రామేశ్వరం' కేఫ్ ఇప్పుడు హైదరాబాద్‌లోని ఐకియా, లుల్లు మాల్‌లో కొలువుదీరబోతుంది. ఈనెల 19 న కేఫ్ ప్రారంభం కానుందని నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. అందులో భాగంగా నగర ఆహార ప్రియులను ఆకట్టుకునేందుకు ఉచితంగా ఫుడ్ ట్రయల్ చేపట్టింది. దీంతో మంళవారం కేఫ్ నిండా ఫుడ్ లవర్స్ సందడి చేశారు. దోస, ఇడ్లి తింటూ రుచి బాగుందని సోషల్ మీడియాలో పోస్టులు చేశారు. అంతేకాదు కేఫ్ అంతా జనంతో నిండిపోయింది. వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతుంది.

త్రివిక్రమ్‌కు మతి భ్రమించింది

లెనిన్, మార్క్స్ పేర్లు విలన్లకు పెడతారా?

ముషీరాబాద్, జనవరి 16: గుంటూరు కారం సినిమాలో ప్రతినాయక పాత్రలకు శ్రామికవర్గం నేత మార్క్స్, లెనిన్ పేర్లు పెట్టడం అభ్యంతరకరమని, వెంటనే సినిమా నిర్మాత ఆ పేర్లను తొలగించాలని పీడీఎస్‌యూ, పీవైఎల్ నేతలు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సినిమా డైరెక్టర్ త్రివిక్రమ్‌కు మతి భ్రమించి శ్రామికవర్గం నేతల పేర్లను సినిమా విలన్ పాత్రలకు పెట్టి సమాజానికి తప్పుడు సంకేతాలు పంపిస్తున్నారని ఆరోపించారు. ప్రపంచానికి కమ్యూనిజాన్ని పరిచయం చేసిన శ్రామికవర్గం నేతల పేర్లను సినిమాలో వాడుకోవడం బాధాకరమని పేర్కొన్నారు. గుంటూరు కారం సినిమా నుంచి మహనీయుల పేర్లను తొలగించి సినిమా డైరెక్టర్ బేషరతుగా క్షమాపణ చెప్పాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు పెద్దింటి రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి ఆజాద్, పీవైఎల్ అధ్యక్షుడు కెఎస్ ప్రదీప్, ప్రధాన కార్యదర్శి అజయ్ డిమాండ్ చేశారు.

'ఫుడ్ ప్యాకేజింగ్'ను డెవలప్ చేసిన సీఎఫ్‌టీఆర్ఐ

- ఆహార నాణ్యత, పోషక విలువలను పెంచనున్న ఎం-ప్యాక్
- ఫుడ్ ఇండస్ట్రీ వ్యాపారులకు లాభసాటిగా ఉంటుందన్న నిపుణులు

సిటీబ్యూరో, జనవరి 16(నమస్తే తెలంగాణ) : ఫుడ్ ఇండస్ట్రీలో కొనసాగుతున్న ఆంత్రప్రెన్యూర్లకు మెళకువలను అందించే సెంట్రల్ ఫుడ్ టెక్నాలజీ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ మరో అధునాతన సదుపాయాన్ని అభివృద్ధి చేసింది. ఫుడ్ తయారీపై ఇప్పటికే ఫుడ్ రకాన్ని బట్టి ప్రత్యేక సాంకేతికతను డెవలప్ చేయగా... తాజాగా ప్యాకేజింగ్ విధానాన్ని అందుబాటులోకి తీసుకువచ్చింది. ప్రస్తుతం మార్కెట్‌లో ఉన్న పద్ధతుల కంటే సమర్థవంతంగా ఆహార నాణ్యత ఉంటుందని, ఖర్చు కూడా తక్కువగా ఉండేలా ఎం-ప్యాక్ విధానాన్ని డెవలప్ చేసినట్లుగా సీఎఫ్‌టీఆర్ఐ నిపుణులు వెల్లడించారు. ఏ ఆహారాన్ని ఎలా ప్యాక్ చేయాలి. ఎంత తేమ ఉండాలి. ఆహారాన్ని ఏ ఉష్ణోగ్రతల వద్ద ప్యాకేజింగ్ చేయాలనే అంశాలతో రూపొందించిన ప్రత్యేక సాఫ్ట్‌వేర్... ఫుడ్ ప్యాకేజింగ్ రంగంలో ముఖ్య భూమికను పోషిస్తుందన్నారు. సాఫ్ట్‌వేర్ ఆధారంగా పనిచేసేలా ఈ ప్యాకేజింగ్ విధానాన్ని డెవలప్ చేశారు. దేశంలోని అన్ని ప్రాంతాల వాతావరణ, ఉష్ణోగ్రత, శీతోష్ణ పరిస్థితులకు అనుగుణంగా ఫుడ్ ఏ సందర్భంలో ప్యాకేజింగ్ చేయాలని చూపుతుంది. దీని ద్వారా ఒకసారి ఆహారాన్ని తయారు చేసిన తర్వాత అందులో ఉండే పోషకాలు, టెంపరేచర్‌తోపాటు, ఆర్‌హెచ్ విలువ వంటి 22 రకాల మెటరోలాజికల్ అంశాలను పరిగణనలోకి తీసుకొని ప్యాకేజింగ్ సూచనలు ఇస్తుంది. ముఖ్యంగా ఆహారంలో చేరిన తేమ పరిమాణాన్ని బట్టి నాణ్యత అంచనా వేసేందుకు వీలు ఉంటుందని, ఏ మేరకు తేమ ఉంటుందనే విషయాన్ని బట్టి ఆహారాన్ని నిల్వ చేసేలా ఈ అధునాతన ప్యాకేజింగ్ విధానం సాయపడుతుందని పరిశోధకులు తెలిపారు. ఈ ప్యాకేజింగ్ టెక్నాలజీ ద్వారా ఆహార ఉత్పత్తుల వివరాలు, ప్యాకేజింగ్, అందులో వాడే మెటీరియల్‌ను బట్టి నాణ్యత తెలిసిపోతుంది. అదేవిధంగా ఆహారంలో మారుతున్న తేమశాతం ద్వారా ఫుడ్ ఎక్స్‌పైరీ ముందుగానే అంచనా వేయడానికి ఆస్కారం ఉంటుందని సీఎఫ్‌టీఆర్ఐ వర్గాలు తెలిపాయి.

బీఈ పరీక్షా ఫీజు స్వీకరణ గడువు పొడిగింపు

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 16: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని బీఈ కోర్సుల పరీక్ష ఫీజు స్వీకరణ గడువును పొడిగించినట్లు కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. బీఈ (ఏఐసీటీఈ), బీఈ (సీబీసీఎస్), బీఈ (నాన్ సీబీసీఎస్) కోర్సుల మెయిన్, బ్యాక్‌లాగ్ పరీక్షా ఫీజును ఈ నెల 20 లోపు సంబంధిత కళాశాలల్లో చెల్లించవచ్చు.

జీహెచ్ఎంసీ ట్రాఫిక్‌పై డీజీపీ సమీక్ష

హైదరాబాద్, జనవరి 16 (నమస్తే తెలంగాణ) : గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) పరిధిలోని ట్రాఫిక్ పరిస్థితిపై రాష్ట్ర డీజీపీ రవిగుప్తా మంగళవారం సీనియర్ పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రజల సౌకర్యార్థం జీహెచ్ఎంసీ పరిధిలో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడానికి, మెరుగుపరచడానికి సమర్థవంతమైన చర్యలపై పో